www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 29 మే 2024
5
పశ్చిమ గోదావరి

సుందరయ్య భవనంలో ఉచిత మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం, వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో చిన్నపిల్లల ఉచిత మెడికల్ క్యాంపు మంగళవారం జరిగింది. ఈ క్యాంప్‌ను పరిసర ప్రాంతాల నుండి సుమారు 20 మంది చిన్నారులు వినియోగించుకున్నారు. డాక్టర్ విక్రమ్ ఉచితంగా 2డి ఎకో నిర్వహించారు. చికిత్స అవసరమైన వారిని గుర్తించి వారికి ట్రీట్‌మెంట్ ఇప్పించడం జరుగుతుందని వసుధ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు తెలిపారు. నిరంతరం నిర్వహించే ఉచిత మెడికల్ క్యాంపులను వినియోగించుకోవాలని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం తెలిపారు.

అమ్మో.. జూన్..!

- హడలిపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- ప్రయివేటు, కార్పొరేట్ ఫీజులపై ఆందోళన
- ఎల్‌కెజికి సైతం రూ.30 వేలకుపైగానే ఖర్చు
- ఇంటర్ హాస్టల్ విద్యకు రూ.2.50 లక్షలుపైనే
- ఇంజినీరింగ్, ఇతర విద్యలకు రూ.లక్షలు కట్టాల్సిందే
- దిక్కుతోచని స్థితిలో సామాన్య ప్రజానీకం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జూన్‌లో నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతుంది. స్కూళ్ల నుంచి కాలేజీల వరకూ అన్నీ తెరుచుకుంటాయి. పిల్లల చదువుకు సంబంధించిన ఫీజులు, హాస్టల్ ఖర్చులను తలుచుకుని తల్లిదండ్రులు అమ్మో.. జూన్ అంటూ ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చదువు సామాన్యులకు అందని ద్రాక్షగా మారిపోయింది. ప్రభుత్వం ఇస్తున్న ఫీజు రీయంబర్స్‌మెంట్, అమ్మఒడి వంటివి కంటితుడుపు మాత్రమే. విద్యాసంస్థలు వసూలు చేస్తున్న ఫీజులకు, ప్రభుత్వం అందిస్తున్న సాయానికి సంబంధం లేకుండాపోయింది. దీంతో సామాన్య కుటుంబాలకు పిల్లల చదువులు భారంగా మారాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వెయ్యి వరకూ ప్రయివేటు స్కూళ్లు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 210 ఉండగా, ప్రాథమికోన్నత 493, ఉన్నత పాఠశాలలు 313 వరకూ ఉన్నాయి. వీటిలో దాదాపు మూడు లక్షల మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు.

ప్రస్తుతం ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో విద్య పూర్తిగా డబ్బుమయమైంది. ఎల్‌కెజికి సైతం రూ.30 వేలకుపైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తరగతులు పెరుగుతున్న కొద్దీ ఫీజుల భారం తడిసి మోపెడవుతోంది. పదో తరగతి విద్యార్థికి ఏడాదికి రూ.లక్ష వరకూ ఖర్చు చేస్తే తప్ప చదువు పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఇక హాస్టల్‌లో చేర్పిస్తే ఆ ఖర్చు రెట్టింపవుతోంది. ఇద్దరు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు తక్కువగా లెక్కించినా కనీసం ఏడాదికి హైస్కూల్ చదువు నిమిత్తమే రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. పుస్తకాలు, యూనిఫారం, రవాణా, ఇతర ఛార్జీల పేరుతో తల్లిదండ్రులను ప్రయివేటు యాజమాన్యాలు పిండేస్తున్నాయి. తల్లిదండ్రులు ఇద్దరూ ఏడాది పొడవునా కష్టపడినా చదువుల కోసం అప్పు చేయక తప్పడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లల చదువు కోసం ప్రయివేటు స్కూళ్లను ఆశ్రయిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్ల దోపిడీకి అడ్డూఅదుపు లేకుండాపోయింది. జూన్ వచ్చిందంటే ప్రతి కుటుంబమూ పిల్లల చదువు కోసం కనీసంగా లెక్కించినా రూ.లక్ష వరకూ ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. దీంతో జూన్ నెల వస్తుందంటే తల్లిదండ్రులు భయపడే పరిస్థితి ఏర్పడింది.

ఉన్నత విద్యకు రూ.లక్షలు వెచ్చించాల్సిందే

ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత ఖరీదైందిగా ఇంటర్ విద్య మారిపోయింది. ఎంసెట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్, ఇతర ప్రయివేటు యూనివర్సిటీల్లో సీటు సాధించాలంటే కాంపిటేటివ్ పరీక్షల్లో విద్యార్థులు తమ ప్రతిభ చూపాల్సిందే. లేకపోతే ఇంజినీరింగ్, నీట్ వంటి కోర్సుల చదువుకు సంబంధించి ఉచిత సీటు సాధించడం సాధ్యం కాదు. ఇంటర్ విద్య అత్యంత కీలకంగా మారింది. దీంతో ఇంటర్ విద్య కోసం తల్లిదండ్రులు భారీగా ఖర్చు పెడుతున్న పరిస్థితి ఉంది. డేస్కాలర్‌గా ప్రయివేటులో ఇంటర్ విద్య అభ్యసించాలన్నా ఏడాదికి రూ.లక్ష వరకూ ఖర్చవుతోంది. ఇక హాస్టల్ విద్యార్థిగా చేరితే రూ.రెండు లక్షలు నుంచి రూ.మూడు లక్షల వరకూ ఫీజు చెల్లించాల్సిందే. ఇది తల్లిదండ్రులకు పెనుభారంగా మారింది. ఇంటర్ విద్య పూర్తి చేసి ఇంజినీరింగ్‌లో చేరితే హాస్టల్ ఫీజు రూ.80 వేలుపైనే ఉంటుంది. ఇక వివిధ రకాల ఫీజుల కింద మరో రూ.30 వేలకుపైగా లాగేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయంబర్స్‌మెంట్ కేవలం ట్యూషన్ ఫీజుకు మాత్రమే వర్తిస్తోంది. హాస్టల్, ఇతర ఫీజులన్నీ చెల్లించుకోక తప్పదు. దీంతో ఇంజినీరింగ్ నాలుగేళ్ల కోర్సుకు ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తించిన విద్యార్థికైతే రూ.ఐదు లక్షలు, వర్తించని విద్యార్థులకు రూ.ఎనిమిది నుంచి రూ.పది లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. నీట్‌లో ఎంబిబిఎస్ ఉచిత సీటు సాధిస్తే హాస్టల్, ఇతర ఖర్చుల కింద ఏడాదికి రూ.రెండు లక్షలకుపైగా అవుతోంది. ఉచిత సీటు రాకపోతే రూ.25 లక్షలుపైనే ఏడాదికి ఖర్చు పెట్టాల్సి ఉంది. ఉచిత సీటు వస్తే తప్ప ఎంబిబిఎస్ కోర్సుల వైపు సామాన్య విద్యార్థులు చూడలేని పరిస్థితి నెలకొంది. బి.ఫార్మసీ వంటి కోర్సులకు సైతం భారీగా ఖర్చవుతున్న పరిస్థితి నెలకొంది. ఎల్‌కెజి నుంచి ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువుల వరకూ సామాన్య ప్రజానీకానికి మోయలేని భారంగా మారింది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం పిల్లల చదువుల కోసం అప్పు చేసి రోడ్డున పడుతున్న పరిస్థితి ఉంది. సామాన్య కుటుంబాల పిల్లలకు ఉచితంగా విద్యను ప్రభుత్వం అందించకుండా వదిలేసింది. దీంతో డబ్బు ఉంటేనే చదువు అనే పరిస్థితి తయారైంది. ఫీజులు వసూళ్లపైనే ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో ప్రయివేటు యాజమాన్యాలు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు పరిస్థితి మారిపోయింది.

భీమవరంలో కౌంటింగ్ సెంటర్ వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న అశోక్‌కుమార్

హింసాత్మక చర్యలకు పాల్పడితే చర్యలు

డిఐజి జివిజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఆచంట

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు, హింసాత్మక చర్యలకు పాల్పడిన వారిపై ఉక్కుపాదం తప్పదని ఏలూరు రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జివిజి.అశోక్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం ఆయన ఆచంట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ విధ్వంసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉంటారని, అల్లర్లు, గొడవలు విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ రోజు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన రాజకీయ పార్టీల నాయకులు బాణసంచా కాల్చడం, ర్యాలీలు చేపట్టడం, ఉత్సవాలు, సభలు సమావేశాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు లేవని ఆయన స్పష్టం చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ ఎక్కడా ఎటువంటి గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు కూడా పోలీసు అంతరంగానికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కెవి.భీమారావు, నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాసరావు, పెనుగొండ సిఐ రజినీ కుమార్, ఎస్‌ఐలు ఎం.రాజ్‌కుమార్, పి.రవీంద్రబాబు, షేక్ సుభాని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : స్ట్రాంగ్ రూముల వద్ద ప్రతిష్టమైన భద్రతతో పాటు కౌంటింగ్ రోజున ఎటువంటి అసాంఘిక ఘటనలు, గొడవలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిఐజి జివిజి అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం భీమవరంలోని ఎస్‌ఆర్ కెఆర్, విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూముల భద్రత, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను డిఐజి జివిజి అశోక్ కుమార్, ఎస్‌పి వి అజితతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడారు. భీమవరంపై డ్రోన్లు ఎగిరేందుకు సిద్ధం అవుతున్నాయని తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున ఎటువంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం డ్రోన్లు ప్రయోగించనున్నారు. మరోవైపు ఎక్కడికక్కడ సీసీ కెమెరాలతో నిఘా పెడుతున్నారన్నారు. భీమవరంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడం, ఎటువంటి అల్లర్లు జరగకుండా చూడటం కోసం ఇప్పటికే పలు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కౌంటింగ్ రోజున 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. అల్లర్లు, హింసాత్మక సంఘటనలకు పాల్పడే వ్యక్తులను గుర్తించేందుకు డ్రోన్లు వినియోగించనున్నామని, సీసీ కెమెరాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లే మార్గాల వద్ద ఏర్పాటు చేసిన దిక్సూచి బోర్డులు స్పష్టంగా ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రాల్లో వీడియో గ్రఫీ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ రోజున కేంద్రాల ప్రవేశ ద్వారాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు సంబంధిత అధికారుల నుంచి గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాలైన రెండు కాలేజీల ప్రహరీ నుంచి 100 మీటర్ల దూరంలో బ్యారికేడ్లు ఏర్పాటు చేసుకొని తగిన బందోబస్తు ఉంచాలన్నారు. అక్కడ నుంచి ఏ ఒక్క వాహనం అనుమతించరాదని అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కఊ సహకరించాలని ఎస్‌పి కోరారు. వారి వెంట అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) వి.భీమారావు, డిఎస్‌పి వి.నారాయణస్వామి రెడ్డి, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డిఎస్‌పి ఎం.సత్యనారాయణ, దిశా డిఎస్‌పి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జూన్ 4వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు అన్ని విధాలా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి నగరంలోని ఆనంద ఇన్ సమావేశ మందిరంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లతో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 4న విష్ణు కాలేజీలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజవర్గాలకు, ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉదయం 8.00 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అలాగే ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందన్నారు. అనంతరం సుమారు 8.30 గంటల నుంచి ఏడు నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లలో ఇవిఎంల ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. నరసాపురం పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విష్ణు కాలేజీ వద్ద మాత్రమే జరుగుతుందన్నారు. ఉదయం 5.00 గంటల నుంచి కౌంటింగ్ సిబ్బంది టేబుల్స్ కేటాయింపు ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, ఆరు గంటల్లోగా కౌంటింగ్ సిబ్బంది విధులకు రిపోర్ట్ చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 7.00 నుంచి 7.30 వరకూ పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ కేంద్రానికి తరలించనున్నట్లు తెలిపారు. ఉదయం 8.00 గంటలకు ఇటిపిబిఎస్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభం చేస్తామని, ఇందుకోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని, తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ముందస్తు ఏర్పాట్లు చేసుకున్న తర్వాత వాస్తవ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సంపూర్ణంగా అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అర్హత, అనర్హతలను నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఏవైనా ఓట్లు చెల్లుబాటు కాకపోతే 13-సి కవర్లో ఉంచి తిరస్కరిస్తూ వేరుగా పెట్టెలో ఉంచడం జరుగుతుందన్నారు. ఇవిఎం ఓట్ల లెక్కింపు కోసం ప్రతి శాసనసభ నియోజకవర్గానికీ 14 టేబుల్ ఏర్పాటు చేస్తున్నామని, స్ట్రాంగ్ రూముల నుంచి 14 కంట్రోల్ యూనిట్లను తీసుకొచ్చి ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఒక రౌండ్ పూర్తయినట్లుగా ఫలితాన్ని రిటర్నింగ్ అధికారి పరిశీలకుల ఆమోదంతో ప్రకటిస్తారన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఏజెంట్లను కౌంటింగ్ హాల్ నుంచి బయటకు పంపేందుకు రిటర్నింగ్ అధికారికి సర్వహక్కులు ఉన్నాయన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఎస్‌పి అజిత వెజెండ్ల మాట్లాడుతూ పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి ప్రతినిధులు, అనుచరులకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎలాంటి గొడవలు గాని, దౌర్జన్యాలు హింసకు పాల్పడే విధంగా గాని చేయరాదని వీడియో సందేశం పంపాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి వచ్చే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ లైటర్ గానీ ఎటువంటి ఆయుధాలతో గానీ ప్రవేశించరాదన్నారు. విజయం సాధించిన అభ్యర్థులు ఇతర అభ్యర్థులను ఉద్దేశించి కించపరుస్తూ మాట్లాడరాదన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సమన్వయ అధికారి చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ మద్రాపు సన్యాసిరావు, పోటీ చేస్తున్న అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

రిటర్నింగ్ అధికారి చెన్నయ్య

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జూన్ 4వ తేదీన భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్య తెలిపారు. ఆయన ప్రజాశక్తిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 15 రౌండ్లలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఫలితం వెలువడుతుందన్నారు. ముందుగా బంగారుగూడెం 1వ పోలింగ్ కేంద్రం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమై ఆఖరి పోలింగ్ కేంద్రం పెంటపాడు మండలం రామచంద్రపురం 209 పోలింగ్ బూత్‌తో ఎన్నికల కౌంటింగ్ ముగుస్తుందన్నారు.

చిట్ చాట్

ప్రశ్న : తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయి?

ఆర్‌ఒ : తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని 209 పోలింగ్ కేంద్రాల్లో 2,14,985 ఓటర్లకు గాను 1,75,990 ఓట్లు పోలయ్యాయి. 81.86 శాతం పోలింగ్ నమోదైంది.

ప్రశ్న : పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎన్ని?

ఆర్‌ఒ: 2045 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి.

ప్రశ్న : హోం ఓటింగ్‌కు సంబంధించి ఎన్ని ఓట్లు పోలయ్యాయి?

ఆర్‌ఒ : హోమ్ ఓటింగ్‌కు సంబంధించి 151 గాను 150 ఓట్లు పోలయ్యాయి.

ప్రశ్న : ఆన్‌లైన్ సర్వీస్ ఓట్లు ఎన్ని పోలయ్యాయి?

ఆర్‌ఒ : ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా ఈ నెల 27వ తేదీ నాటికి 117 ఓట్లు పోలయ్యాయి.

ప్రశ్న : టేబుల్స్ ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు?

ఆర్ : 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నాం. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం అదనంగా నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న : పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఎప్పుడు మొదలు పెడతారు?

ఆర్‌ఒ : ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, 8:15 నుంచి 8:30 మధ్య ఇవిఎం కౌంటింగ్ మొదలుపెడతాం. క్యాండిడేట్, ఏజెంట్ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉదయం 6:30కు హాజరు కావాలి.

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, నాయకులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఉండి ఎంఎల్‌ఎగా కనుమూరి రఘు రామకృష్ణంరాజు, నరసాపురం పార్లమెంట్ సభ్యులుగా భూపతి రాజు శ్రీనివాస్‌వర్మకు విజయం చేకూరాలని ఆకాంక్షిస్తూ హోమ క్రతువులు నిర్వహించారు. అనంతరం ఎన్‌టి రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మండల అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, పట్టణ అధ్యక్షులు బొల్లా వెంకట్రావు, మండల క్లస్టర్ 3వ ఇన్‌ఛార్జి గొంట్ల గణపతి, మండల ప్రధాన కార్యదర్శి నౌకట్ల రామారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : ఎన్‌టిఆర్ రామారావు జయంతిని భీమవరంలో టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక పార్టీ కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు, ఉండి శాసనసభ్యుడు మంతెన రామరాజు అధ్యక్షతన ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా మంతెన రామరాజు మాట్లాడారు. తెలుగువారి ఆరాధ్య దైవం ఎన్‌టిఆర్ అని కొనియాడారు. భీమవరం పట్టణ టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ఎన్‌టిఆర్ జయంతి కార్యక్రమంలో రాష్ట్ర పాలిట్ బ్యూరో సభ్యురాలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి, ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీతారామలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఎన్టీఆర్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో పాలు రొట్టె పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు సిరిగినీడి రాజ్యలక్ష్మి, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేని గౌర్నాయుడు పాల్గొన్నారు.

పాలకొల్లులో వికలాంగులకు బియ్యం పంపిణీ చేసిన అంగర రామ్మోహన్

పాలకొల్లు: ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎంఎల్‌ఎ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ముఖ్య టిడిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా పేదలు, వికలాంగులకు పది కేజీల బియ్యం, దుస్తులు, నిత్యావసర సరుకులు, పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపి, చిట్టూరి రామాంజనేయులు, మాతా రత్నంరాజు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ : ఆర్‌ఒ

ప్రజాశక్తి - ఉండి

ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు సహకరించి ఉదయం 6.30 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. మంగళవారం ఉండి ఎంపిడిఒ కార్యాలయ సమావేశం మందిరంలో సార్వత్రిక ఎన్నికలు - 2024 ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి కౌంటింగ్ కేంద్రమైన భీమవరం ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లు, సంబంధిత అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకారం అందించారని, ఇదే సహకారాన్ని ఓట్ల లెక్కింపు ప్రక్రియకు, జిల్లా యంత్రాంగానికి అందించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. సజావుగా లెక్కింపు నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. కౌంటింగ్ హాల్లోకి ప్రవేశం, అసెంబ్లీ, పార్లమెంట్ టేబుళ్ల అమరిక మొదలైనవి అభ్యర్థులు, ఏజెంట్లు ముందుగా పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఉండి నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరుగా కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని, ఇవిఎం ఓట్లలెక్కింపు కోసం అసెంబ్లీకి - 14 టేబుల్స్, పార్లమెంట్‌కు 14 టేబుల్స్, అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా 4 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. దీనికిగాను పటిష్టమైన బందోబస్తు, ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌ఒ ప్రవీణ్ ఆదిత్య

మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - నరసాపురం

ఎన్నికల విధుల్లో పాల్గొనే మైక్రో అబ్జర్వర్లకు రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్ ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ తరగతులు నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో ఆర్‌డిఒ అంబరీష్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైందన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి అంశాన్నీ సునిసితంగా పరిశీలించి నివేదిక అందించాలన్నారు. ఇవిఎంల్లో పోలైన ఓట్లు, 17 సిలో నమోదైన ఓట్ల వివరాలను పైఅధికారులకు అందజేయాలన్నారు. టేబుల్‌కు ఒకరు చొప్పున మైక్రో అబ్జర్వర్ నియమింపబడతారని, ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని ఉదయం ఎనిమిది గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసాపురం తహశీల్దార్ ఎన్ఎస్ఎస్.ప్రసాద్, మొగల్తూరు తహశీల్దార్ బిఆర్ఎస్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తరంజన్ పోరాటాలు ఎనలేనివి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆచంట మాజీ ఎంఎల్‌ఎ, సిపిఎం నేత అలుగు చిత్తరంజన్ చేసిన ప్రజా పోరాటాలు ఎనలేనివని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ అన్నారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద చిత్తరంజన్ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ చిత్తరంజన్ సిపిఎం పట్టణ కార్యదర్శిగా, జిల్లా నాయకులుగా అనేక సేవలందించారని తెలిపారు. చిత్తరంజన్ గతంలో యువజన సంఘం నాయకులుగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులుగా పనిచేశారని కూలీల సమస్యలపై అనేక పోరాటాలు చేశారని తెలిపారు. భీమవరం పట్టణంలో నివాస ప్రాంతాల్లో తాగునీరు, డ్రెయినేజీ, ఇళ్ల స్థలాలు సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. చిత్తరంజన్ మరణం సిపిఎం పార్టీకి తీరనిలోటని తెలిపారు. ఆయన ఆచంట నియోజకవర్గంలో సిపిఎం తరపున గెలుపొంది ప్రజలకు అనేక సేవలందించారన్నారు. సిపిఎం శాసనసభ్యులుగా పనిచేసినా సొంతిల్లు కూడా లేని నిస్వార్థపరుడు అలుగు చిత్తరంజన్ అన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పని చేసిన నాడే ఆయనకి నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, సిపిఎం నాయకులు ఎం.ఆంజనేయులు, క్రాంతి బాబు, లతా రత్నకుమారి, రఫీ పాల్గొన్నారు.

చిత్తరంజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

మార్టేరు గ్రంథాలయంలో ఓరుగామి చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఓరుగామి ప్రదర్శనతో విద్యార్థులు

కాగితాలకు సృజన జోడించి, కత్తెరతో వివిధ ఆకృతులను కత్తిరించడమే ఓరుగామి అని విశ్రాంత ఇంగ్లీష్ ఉపాధ్యాయిని పడాల సువర్ణ గౌరి అన్నారు. మంగళవారం మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు తయారు చేసిన కాగితపు ఆకృతులను ప్రదర్శించారు. అనంతరం పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్‌తో పాటు చదవడం, రాయడం, ఇతర ఆటలు నేర్పించారు. జట్లుగా పిల్లలు పాల్గొన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గుడిమెట్ల రామారెడ్డి, శాఖా గ్రంథాలయం అధికారి పిటి.శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల సందర్భంగా పిల్లలు చాలా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మంగళవారం విద్యార్థులు పోటా పోటీగా పుస్తకాలు చదివారు. రిసోర్స్ పర్సన్ బార్క్ సీనియర్ శాస్త్రవేత్త రంగినీడి సుబ్బారావు పిల్లలుకు ఇష్టమైన కథలు వివరించి వాటిలో ఉన్న నీతిని వారికి తెలియజేసి కథలు చదవడంతో ఊహ శక్తి పెరుగుతుందన్నారు. భాష, భావవ్యక్తీకరణ స్పష్టంగా ఉంటాయి. స్ఫూర్తినిచ్చే కథలు దేశ నాయకులు, దేశ స్వాతంత్రం కోసం పోరాడిన వారి కథలు, వారి చరిత్రలు లైబ్రరీలో అందరికీ అందుబాటులో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఈద ప్రకాశం రిటైర్డ్ ఇన్సూరెన్స్ ఆఫీసర్ సుధీర్ మోహన్, సూర్యం బాబు పాల్గొన్నారు. ఈ సమ్మర్ క్యాంపు జూన్ 7వ తేదీ వరకు కొనసాగుతుందని పిల్లలు పాల్గొనవలసిందిగా గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్ కుమారి తెలిపారు.

ఆలస్యమైన నరసాపురం-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రైలు

ప్రజాశక్తి - పాలకొల్లు

మంగళవారం నరసాపురం నుంచి హైదరాబాద్ వెళ్ళు నరసాపురం-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రైలు 4 గంటలు ఆలస్యంగా బయలు దేరింది. పాలకొల్లు నుంచి రాత్రి 7 గంటలకు బదులు రాత్రి 11 గంటలకు బయలుదేరింది. నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ రావలసిన 12788 నాగర్ సోల్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా రావడమే దీనికి కారణంగా తెలుస్తోంది. నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ ఉదయం 9 గంటలకు రావాల్సి ఉండగా సాయంత్రం 4 గంటలకు వచ్చింది. దీంతో ఇదే రైలు నరసాపురంలో శుభ్రం చేశాక నరసాపురం-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది. ఈ విషయాన్ని పాలకొల్లు రైల్వే స్టేషన్ మాస్టర్ రామలింగేశ్వరరావు ప్రజాశక్తికి ధృవీకరించారు.

ఘనంగా శ్రీదేశాలమ్మ జాతర

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లాకు దిగువన వేంచేసియున్న శ్రీదేశాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా మంగళవారం పట్టణంలో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహంతో జాతర ఐటమ్స్‌తో, బ్యాండ్ మేళాలతో, బాణాసంచాతో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. నాట్య ప్రదర్శన, సన్నాయి మేళం, బేతాళ వేషాలు, బుట్ట బొమ్మలు, కోర గేదెలు, కేరళ తంబోలా, సినీ బ్యాండ్ మ్యూజిక్, తీన్మార్ డప్పులతో ఊరేగింపు భారీగా జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో ట్రాఫిక్‌కు పలుమార్లు అంతరాయం కలిగింది.

జోరుగా సాగుతున్న చదరంగం పోటీలు

చదరంగంతో ఆలోచన, శక్తి సామర్థ్యాలు పెంపు

ప్రజాశక్తి - నరసాపురం

చదరంగం ఆడుట వల్ల ఆలోచన, శక్తి సామర్థ్యాలు రెట్టింపవుతాయని బిజిబిఎస్ మహిళా కళాశాల అధ్యక్షుడు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ ప్రెసిడెంట్ ఎన్‌వి.రమణమూర్తి అన్నారు. మంగళవారం నరసాపురం అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో అభయ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో మాస్టర్ చెస్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, జిల్లా చెస్ అసోసియేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 7వ నూలి సాయి అభయ్ మెమోరియల్ ఇండియా ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ కు రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఏడు సంవత్సరాల నుంచి ప్రతి ఏటా నిర్విరామంగా సాయి అభయ్ చెస్ పోటీలను నూలి శ్రీనివాస్ తన కుమారుడు పేరు మీదుగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. నాలుగేళ్ల చిన్నారుల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు ఈ పోటీల్లో పాల్గొనడం గొప్ప విషయమన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు చదువులోనే కాకుండా ఆటలు, క్రీడలు కూడా శిక్షణ ఇప్పించి వారి అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అభయ ట్రస్ట్ ఛైర్మన్, బిజిబిఎస్ మహిళ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు చెల్లంచర్ల సుబ్రహ్మణ్యం, కార్యదర్శి రఘు రాములు, అరేటి మృత్యుంజయ పాల్గొన్నారు.

ప్రథమ బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

నేరాలు - ఘోరాలు

గుర్తు తెలీని వాహనం ఢీ కొని వృద్ధుడు మృతి

ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇంట్లో సిమెంటు పనులు చేయించే నిమిత్తం సరుకులు కొనడానికి సదరు కార్మికునితో కలిసి మోటారు సైకిల్ పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న సంఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందగా, బండి నడుపుతున్న కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం ఉదయం మండలంలోని నెలమూరు వంతెన వద్ద ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు నెలమూరు గ్రామానికి చెందిన నాగరాజు రామరాజు (78), పక్క గ్రామానికి చెందిన తాపీ కార్మికుడు షేక్ సత్తార్(60) బండి మీద సిమెంటు పని నిమిత్తం సరుకులు కోసం వెళ్తున్నారు. ఆ సమయంలో వేగంగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడం వల్ల రామరాజు ఘటనా స్థలంలో మృతి చెందగా, షేక్ సత్తార్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అతన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మృతి చెందిన రామరాజుకు భార్య, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రభుత్వాసుపత్రిలో గుర్తు తెలీని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి((55) మృతదేహం ఉన్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. ఊరు, పేరు, గుర్తు తెలియని వ్యక్తి దిగమర్రు నుంచి చించినాడ వైపు వెళ్తూ బై-పాస్ రోడ్‌లో శ్రీ తేజ ట్రేడర్స్ ఐరన్, సిమెంట్ షాపు వద్ద నడుచుకుంటూ వచ్చు చుండగా AP 16 DJ 0904 నెంబర్ గల మోటార్ సైకిల్ నడుపుతున్న కావూరు హరికృష్ణ మోటార్ సైకిల్ అతివేగంగా నడిపి ఈ వ్యక్తిని గుద్దాగా తలకు బలమైన రక్తస్రావం అయినట్లు తెలిపారు. వెంటనే సదరు వ్యక్తిని పాలకొల్లు గవర్నమెంట్ హాస్పిటల్‌లో జాయిన్ చేయగా వైద్యం పొందుతూ ఆదివారం రాత్రి 12 గంటలకు మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పాలకొల్లు రూరల్ ఎస్ఐ సెల్ ఫోన్ 9440796669, 08814222233 కి ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

తక్కువ ఫీజుతో ఉన్నత విద్యే మా లక్ష్యం

శ్రీవాసవి జిఎంఆర్ కళాశాలల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎల్ఎన్‌వి.లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెంలో గత 25 సంవత్సరాలుగా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటగా శ్రీవాసవి జిఎంఆర్ జూనియర్, డిగ్రీ, డిఇడి, బిఇడి కళాశాల నిలిచిందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎల్ఎన్‌వి.లక్ష్మీనారాయణ తెలిపారు. అతి తక్కువ ఫీజులతో ఉన్నతమైన విద్య, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ, యూనివర్సిటీ ఫలితాల్లో ఉత్తమ ఉత్తీర్ణత శాతం సాధిస్తున్న ఏకైక విద్యాసంస్థగా గుర్తింపు పొందినట్లు ఆయన తెలిపారు. తాడేపల్లిగూడెంలో మొట్టమొదటిసారిగా 1998వ సంవత్సరంలో లయన్ గ్రంధి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థాపించబడిన మొట్టమొదటి ప్రయివేట్ డిగ్రీ కళాశాలను వాసవి జిఎంఆర్ డిగ్రీ కళాశాలగా స్థాపించారు. అనంతరం 2002లో జూనియర్ కళాశాల, 2007లో బిఇడి కళాశాలను, 2012లో డిఇడి కళాశాలను స్థాపించి 25 సంవత్సరములు పూర్తి చేసుకుని నేడు సిల్వర్ జూబ్లీ సంవత్సరంగా అడుగుపెట్టినట్లు కళాశాల సెక్రెటరీ తెలిపారు.


శ్రీవాసవి జిఎంఆర్ కళాశాల భవనం..

కళాశాల ప్రత్యేకతలు..

- నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ
- విశేష అనుభవం కలిగిన అధ్యాపక బృందం
- ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు
- సెమినార్లు, ఇండస్ట్రియల్ పర్యటనలు, క్రీడల నిర్వహణ
- పూర్తి సదుపాయాలు కలిగిన ల్యాబ్‌లు
- సొంత మినరల్ వాటర్ ప్లాంట్ సౌకర్యం
- క్యాంపస్ ప్లేస్మెంట్‌లు మా ప్రత్యేకత
- పరిసర ప్రాంతాలకు బస్సు సౌకర్యం
- ఫీజు రియంబర్స్‌మెంట్ సౌకర్యం కలదు

కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా మెరుగైన ఫలితాలు

శ్రీశశి హైస్కూల్ సొంతం

డైరెక్టర్లు ఖండాపు శ్రీనివాస్, నాగమణి

ప్రజాశక్తి - ఉండి

కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా మెరుగైన ఫలితాలు సాధించడం శ్రీశశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సొంతమని ఆ స్కూల్ డైరెక్టర్లు ఖండాపు శ్రీనివాస్ నాగమణి అన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. 2006వ సంవత్సరంలో ఉండిలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో ఆంగ్ల విద్యను అందించాలనే ఉద్దేశంతో శ్రీశశి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను స్థాపించినట్లు వారు తెలిపారు. తొలుత అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను ప్రారంభించిన తాము అంచలంచెలుగా పదో తరగతి వరకూ కొనసాగించామన్నారు. తల్లి లాంటి శిక్షణ, తండ్రి లాంటి రక్షణ తమ పాఠశాల ధ్యేయమని వారు తెలిపారు. 30 సంవత్సరాలుగా విద్యారంగంలోనే ఉంటూ ఎంతోమంది విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించామని అన్నారు. అన్ని పాఠశాలల్లోనూ కేవలం చదువుకే ప్రాముఖ్యత ఇస్తారని, కానీ తమ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికీ చక్కటి విద్యతోపాటు ఎదుటి వ్యక్తిని గౌరవించే సంస్కారం ముఖ్యమని గుర్తించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రతి విద్యార్థిని బట్టీ చదువులకు దూరంగా ఉంచుతూ ప్రతి అధ్యయనాన్ని ప్రయోగాత్మకంగా నేర్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. తమ పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా మండల స్థాయిలో తమ పాఠశాల పేరుని నిలబెట్టడం తమకు గర్వకారణం అన్నారు. మండల స్థాయిలో గత రెండు సంవత్సరాల నుంచి మొదటి స్థానంలో నిలిచిన తమ పాఠశాల విద్యార్థులు ఇంటర్‌లో కూడా మంచి మార్కులు సాధించినట్లు వారు వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో 575 మార్కులతో ఎం.సచిన్ తేజ పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, 573 మార్కులతో ఎం.తేజశ్రీ ద్వితీయ స్థానంలోనూ, 561 మార్కులతో ఎన్.సిరి తృతీయ స్థానంలో నిలిచినట్లు వారు తెలిపారు. అతి తక్కువ ఫీజులతోనే విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తూ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడం తమ లక్ష్యం అన్నారు.

శ్రీశశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ భవనం

విలువలు, క్రమశిక్షణే లక్ష్యంగా విద్యాబోధన

విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ తేతలి సంజీవ రెడ్డి

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులకు విలువలతో కూడిన, క్రమశిక్షణ కలిగిన ఉత్తమ విద్య అందించాలని, విద్యార్థులలో ఉన్నత విద్యా లక్ష్యాలను ఏర్పారచాలని స్కూల్‌ని 1989లో నెలకొల్పినట్లు పెనుమంట్ర విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కార్యదర్శి, కరస్పాండెంట్ తేతలి సంజీవ రెడ్డి అన్నారు. కేవలం వంద మంది విద్యార్థులతో ప్రారభించి, ఎల్‌కెజి నుంచి 5వ తరగతి వరకూ విద్యను అందించిన తాము, 1992లో 6 నుంచి 10వ తరగతి వరకూ విస్తరించి, నేడు 500 నుంచి 600 వరకూ విద్యార్థుల రోల్‌తో పరిసర ప్రాంతాల్లో అగ్రగామి విద్యాసంస్థగా నిలిచినట్లు వెల్లడించారు. పాఠశాలలో టెన్త్ బ్యాచ్ ప్రారంభం నుంచి 92 నుంచి వందశాతం వరకూ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. కరోనాకు ముందు గ్రేడింగ్‌ల్లో 10/10 సాధించిన విద్యార్థులు తదుపరి మార్కుల సాధనలో మండలం, టౌన్ స్థాయిల్లో అగ్రగాములుగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. 2024 టెన్త్ ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థిని ఎ.మాన్విత 587 మార్కులతో మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని, ఇదే విద్యార్థిని ఎపి పాలిసెట్‌లో 80 మార్కులతో స్టేట్ ర్యాంక్ 5065 తెచ్చుకుందని సంజీవరెడ్డి అన్నారు. తమ స్కూల్ టెన్త్ విద్యార్థినులు 2022లో పి.నాగ శ్రీవల్లి(551), 2023లో జి.రమ్యశ్రీ నళిని(576) మార్కులతో అగ్రగాములు అయ్యారన్నారు. ప్రతీరోజు ప్రతీ తరగతిలోనూ ప్రతిఒక్క స్టూడెంట్‌కు వ్యక్తిగత శ్రద్ధతో బోధించడం జరుగుతుందని అన్నారు. ఒత్తిడి లేని విద్య, ఆట పాటలకు విశాలమైన ప్రాంగణం తమ సంస్థలో ఉన్నాయన్నారు. ఈ పాఠశాల నుంచి టెన్త్ ముగించి వెళ్లిన పలువురు విద్యార్థులు, చక్కని విద్యను పొంది, రాష్ట్ర, ఇతర రాష్ట్ర, విదేశాల్లో చక్కటి ఉద్యోగాలు చేస్తున్నారని ఆయన వెల్లడించారు. అనుమతి పొందిన మూడు స్కూల్ బస్సులు నడుస్తున్నాయని, అనుభవం, అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు, మేనేజ్మెంట్ నిరంతర పర్యవేక్షణ, పేరెంట్స్ సహకారం తమ సంస్థ విజయమని సంజీవరెడ్డి అన్నారు.

విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ భవనం..

ఎ.మాన్విత

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

తెలుగు ప్రజల ఆత్మ గౌరవం నిలిపిన ప్రధాత ఎన్‌టిఆర్ అని టిడిపి మండల శాఖ అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి(బుల్లాలు) అన్నారు. మంగళవారం మార్టేరు గ్రామంలోని టిడిపి కార్యాలయంలో విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు, తెలుగువారి ఆత్మగౌరవాన్ని దేశానికి చాటిచెప్పిన మహానాయకుడు, కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మార్టేరు గ్రామ అధ్యక్షుడు కోనాల శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు తేతలి సోమిరెడ్డి, కోనాల ఆచారి, రావుల సూరి, కారేపల్లి భాస్కరరావు, రొబ్బి భాస్కరరావు, వెలగల సత్యనారాయణరెడ్డి, సత్యనారాయణ వేంద్ర, గాదే రాజేష్, దుండి, అల్లాడ చిన్నారావు, మిత్తి రెడ్డి శ్రీను, మజ్జి అచ్యుతరావు, పులవర్తి సురేష్ గుప్తా, కేతా లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉండి: తెలుగు ప్రజల ఆత్మగౌరవమే ప్రధానంగా టిడిపిని స్థాపించి తొమ్మిది నెలల కాలంలోనే ముఖ్యమంత్రి అయిన నందమూరి తారకరామారావు కారణజన్ముడు అని, ఆయనకు భారతరత్న ఇవ్వడమే తగిన గౌరవం అని పలువురు టిడిపి నాయకులు అన్నారు. మంగళవారం ఉండి టిడిపి కార్యాలయంలో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ 101వ జయంతి వేడుకలు సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ తెలుగు సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలోనూ తనదైన ముద్రవేసిన ఎన్‌టిఆర్‌కు భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

ఆచంట: ఎన్‌టిఆర్ ఏ ఆశయాలతో పార్టీని స్థాపించారో ఆ ఆశయాల సాధనకు పార్టీ శ్రేణులంతా పునరంకితం కావాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ అన్నారు. నందమూరి తారక రామారావు 101 పుట్టినరోజు వేడుకలు ఆచంటలో టిడిపి కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కేతా మీరయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు నెక్కంటి ప్రభాకర్ రావు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి పాల్గొన్నారు.

నరసాపురం: పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల లేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంకు భాస్కర నాయుడు, జక్కం శ్రీమన్నారాయణ, శిరిగినీడి రాజ్యలక్ష్మి, వాతాడి ఉమా, కొల్లు పెద్దిరాజు పాల్గొన్నారు.


ఆచంటలో..

తాడేపల్లిగూడెం: టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టి రామారావు 101వ జయంతి వేడుకలు తాడేపల్లిగూడెం నియోజకవర్గం టిడిపి, జనసేన కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ జనసేన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జనసేన నాయకులతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, రామశెట్టి సురేష్, పైబోయిన రఘు, గట్టిమ్ నాని, దాగరపు నాగు, పిడుగు రామ్మోహన్‌రావు బ్రదర్స్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ : తాడేపల్లిగూడెం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ 101వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, కార్యకర్తలు మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెనుగొండ: టి డిపి వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలు వడలి సిద్ధాంతం పెనుగొండ పార్టీ ఆఫీసులో పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఈ సందర్భంగా పితాని వెంకట మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆశయాలకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కటిక రెడ్డి నానాజీ, పెనుగొండ సర్పంచి శ్యామలసోని, రొక్కాల సురేష్ పాల్గొన్నారు.

తణుకు: కీర్తిశేషులు నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని తణుకు పట్టణ, తణుకు మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎన్‌టిఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తణుకు పట్టణ టిడిపి అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో, సినీ రంగం, రాజకీయ రంగంలో ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, తణుకు పట్టణ ప్రధాన కార్యదర్శి ఒమ్మి రాంబాబు, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెనుమంట్ర : పొలమూరులో..

కౌంటింగ్ కేంద్రాల్లో టేబుల్స్ ఏర్పాటు

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఇవిఎమ్, పోస్టల్ బ్యాలెట్, ఇటిపిబిఎస్ ద్వారా పోలైన ఓట్లు లెక్కింపు కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు, ఆమేరకు సంబంధిత అధికారులు, సిబ్బంది విధులపై దిశా నిర్దేశం చేయటం జరిగిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక విష్ణు కళాశాల ఆవరణలో కౌంటింగ్ కేంద్రాలు, టేబుల్స్ ఏర్పాటు, స్ట్రాంగ్ రూములను పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లుతో కలిసి క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు 2024 కోసం పోలైన ఓట్ల లెక్కింపు ఒక నిర్దిష్టమైన కార్యాచరణ, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జూన్ 4వ తేదీ పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోటీలో నిలిచిన అభ్యర్థులకు కౌంటింగ్ కోసం ముందస్తు ఏర్పాట్ల ప్రక్రియ పూర్తి అయినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 4వ తేదీన కౌంటింగ్ కోసం చురుగ్గా ఏర్పాట్లను చేయడం జరుగుతోందని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు సిగ్మెంట్‌లకి 14 చొప్పున పరిశీలకులకి, పోస్టల్, ఇటిపిబిఎస్‌ల కోసం టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ పరిశీలకుల కోసం ఒక టేబుల్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థులకు పోలైన ఓట్లను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించిన బ్లాక్‌లలో లెక్కించనున్నట్లు తెలిపారు. చివరిగా ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్యతో కలిసి స్వయంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఉన్నారు.

కాళ్ల: అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

పలుచోట్ల రుతుక్రమ పరిశుభ్రతా దినోత్సవం

ప్రజాశక్తి - కాళ్ల

రుతుక్రమం, ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ చూపాలని వైద్యాధికారి డాక్టర్ ఎస్.సునీల్ అన్నారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు కాళ్ల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్.సునీల్ ఆధ్వర్యాన ప్రోగ్రాం అధికారులతో రుతుక్రమం-ఆరోగ్యం పరిశుభ్రత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దొడ్డనపూడి అంగన్వాడీ కేంద్రం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'టుగెదర్ ఫర్ ఎ పీరియడ్ ఫ్రెండ్లీ వరల్డ్'(నెలసరి సమయంలో స్నేహపూర్వకంగా ఉండటం) ఈ సంవత్సరం నినాదంగా తీసుకున్నట్లు వివరించారు. అనంతరం డాక్టర్ ఎస్.సునీల్ మాట్లాడుతూ నెలసరి అనేది సాధారణ శరీర ప్రక్రియ, ఆడవారికి సాధారణంగా 10 నుంచి 14 ఏళ్లలోపు మొదలై 45 నుంచి 49 ఏళ్ల మధ్యలో ఆగిపోతుందని తెలిపారు. నెలసరి సమయంలో శారీరకంగాను, మానసికంగాను మహిళలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటారన్నారు. వారిలో మానసిక దృఢత్వాన్ని పెంపొందించాలని, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేలా అక్కడ అందుబాటులో ఉండే సానిటరీ నాప్కిన్స్, ఐరన్, ఫోలిక్ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ డి.విజయవతి, ఎంపిహెచ్ ఇఒ పాల్‌సన్, పిహెచ్ఎన్ ఛండి రాణి పాల్గొన్నారు.

ఉండి: కౌమార దశలోని బాలికలు రుతుక్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలిసిపూడి విలేజ్ హెల్త్ క్లినిక్, అంగన్వాడీ సిబ్బంది తెలిపారు. మంగళవారం ఉండి మండలం కలిసిపూడిలో రుతు క్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా నెలసరిపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల్లో బహిష్టు సమయం తప్పనిసరి అని ఆ సమయంలో ప్యాడ్లు తరచుగా మార్చుకుంటూ జాగ్రత్తలు పాటించాలని, సబ్బు సుగంధ ఉత్పత్తులతో ముఖ్యమైన భాగాలను కడగరాదని లేకపోతే ఇన్ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో నెలసరిపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
నూజివీడు, తాడేపల్లిగూడెం టౌన్, భీమవరం అర్బన్, కైకలూరు టౌన్
విలేకర్లు కావలసిన రూరల్ కేంద్రాలు
వేలేరుపాడు, లింగపాలెం, పెదవేగి, దెందులూరు, పెదపాడు, నిడమర్రు, గుడివాకలంక (ఏలూరు), భీమవరం, నరసాపురం, అత్తిలి, ఇరగవరం, పెంటపాడు, కైకలూరు, జంగారెడ్డిగూడెం, మొగల్తూరు
విలేకర్లకు అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
ఆఫీసు చిరునామా: ప్రజాశక్తి కార్యాలయం, బొలుసువారి వీధి, ఏలూరు టైమ్స్ కార్యాలయం సమీపంలో, పవర్‌పేట, ఏలూరు-2
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయాలి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 99493 66196, 89191 70815, 94900 99168